క్లుప్తంగా

విద్యార్థి దశ నుంచే పరిశోధన పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: విద్యార్థి దశ నుంచే పరిశోధన అభిరుచిని పెంపొందించేలా ప్రోత్సహించాలని మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల్లో విద్యార్థులు ఇలాగే ఉండాలని, భారతదేశం అభివృద్ధి, పరిశోధనపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జ్యోతిలక్ష్మి, కిరణ్మయి, స్వరూపరాణి, హర్‌జ్యోత్ కౌర్, చంద్రయ్య, శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యప్రకాశ్, పడాల తిరుపతి, సంగీత పాల్గొన్నారు.

వైద్యుడికి ఎమ్మెల్సీ అభినందన



నితిన్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రమణ

జగిత్యాలజోన్: జిల్లాలో తొలి కార్డియాలజిస్టుగా పేరుగాంచి, జిల్లా ప్రజలకు సేవలందిస్తున్న డాక్టర్ వోరుగంటి నితిన్‌రావును ఎమ్మెల్సీ రమణ మంగళవారం అభినందించారు. గతంలో జిల్లాలో హృద్రోగంతో బాధపడే వారు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లేవారని, ఇప్పుడు కార్డియాలజిస్టు సేవలు జగిత్యాలలో దొరకడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు సింగిల్ విండో చైర్మన్ సాగర్‌రావు, డాక్టర్ వీరేందర్, రిటైర్డ్ హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కూరగాయల సాగుపై అవగాహన

ఇబ్రహీంపట్నం: రైతునేస్తంలో భాగంగా వేసవికాలంలో కూరగాయల సాగుపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మట్టి పరీక్ష, నమూనాల సేకరణ పద్ధతి, సమస్యాత్మక నెలల పునరుద్ధరణ, నివారణ చర్యలపై వివరించారు. కూరగాయల సాగు విధానం, అవలంబించాల్సిన పద్ధతుల గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, సుకిత్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, ఏఈవోలు నరేశ్, శ్యామ్‌కుమార్, రవళిక, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు స్ఫూర్తివంతం



రమేశ్‌ను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీసుల సేవలు స్ఫూర్తివంతమని అదనపు ఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పీసీఆర్ ఎస్సై రమేశ్‌ను ఎస్పీ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. త్యాగాలతోపాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం గర్వకారణమన్నారు. ఆర్ఐ జానివియా, ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ రఫీక్‌ఖాన్, ఆర్‌ఎస్సైలు కృష్ణ, వినోద్‌రెడ్డి, పీసీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

కొండగట్టు: దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎన్‌ఎస్‌యూఐ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సాదుల వినయ్ అన్నారు. కొడిమ్యాలలో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణగౌడ్, విక్రమ్‌గౌడ్, నిఖిల్, వంశీ, సాయి, వినయ్, సన్నీ, తేజ, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీస్‌యాక్ట్ అమలు

జగిత్యాలక్రైం: ఈనెల ఒకటి నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

‘పది’ లో ప్రభుత్వ విద్యార్థుల హవా



బుగ్గారంలో విజయ సంకేతం చూపిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థినులు, ఉపాధ్యాయులు

జగిత్యాల: జగిత్యాల జిల్లాలో 232 హైస్కూళ్లు ఉండగా మొత్తం101 స్కూళ్లలో వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 97 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 392 మంది పరీక్షలు రాయగా 379 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన ఎస్.లహరి 10 జీపీఏ సాధించారు.

ఇటిక్యాల మోడల్‌స్కూల్ విద్యార్థి ప్రతిభ

జగిత్యాలరూరల్(రాయికల్): రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌కు చెందిన సాయిరిషిత్ 10 జీపీఏ సాధించగా, సీహెచ్.స్ఫూర్తి 9.8, పి.సాత్విక, ఎ.ఆదిత్య 9.7 జీపీఏ సాధించారు.

పదో తరగతిలో నలుగురికి 10 జీపీఏ

రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలకు చెందిన మారంపల్లి వర్షిని, దనవేని హర్షిని, చిరుమల్ల శ్రీధర్, తోట మణిదీప్ 10 జీపీఏ సాధించారు.

బీర్‌పూర్‌లో 2, సారంగాపూర్ మండలంలో 3 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం..

సారంగాపూర్: పదో తరగతి ఫలితాల్లో సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలు ఉత్తమ ఫలితాలను సాధించాయి. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సారంగాపూర్ మండలంలో 3 ప్రభుత్వ పాఠశాలలు, బీర్‌పూర్ మండలంలో రెండు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత వచ్చింది. కోనాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చుక్క అక్షర (ఆంగ్లమాధ్యమం)లో 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

సారంగాపూర్ మండలంలో :

సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 34 మంది విద్యార్థులకు 34 మంది ఉత్తీర్ణత సాధించారు. అర్పపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 మందికి 9 మంది, కస్తూర్బా బాలికల విద్యాలయం సారంగాపూర్‌లో 43 మందికి 43 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు.

బీర్‌పూర్ మండలంలో

నర్సింహులపల్లెలో 15 మంది విద్యార్థులు (100 శాతం), తుంగూర్‌లో 13 మంది (100 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

పెగడపల్లిలో 96.26 శాతం ఉత్తీర్ణత

పెగడపల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పెగడపల్లి మండలంలో 96.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ మోడల్ స్కూల్, కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల నుంచి 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 206 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. బతికపల్లి, నామాపూర్ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి.

మల్లాపూర్‌లో 95 శాతం ఉత్తీర్ణత

మల్లాపూర్ : పదో తరగతి ఫలితాల్లో మల్లాపూర్ మండలం 95 శాతంతో 441మంది విద్యార్థులకు గాను 419మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో భీమయ్య తెలిపారు. 14 ప్రభుత్వ పాఠశాలల్లోంచి 95.38శాతంతో 433 మంది విద్యార్థులకు గాను 413మంది ఉత్తీర్ణులు కాగ, మండలంలోని చిట్టాపూర్, వాల్గొండ, గుండంపల్లి జెడ్పీ హైస్కూళ్లతో పాటు మల్లాపూర్ మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం 100శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఇబ్రహీంపట్నంలో 93.53 శాతం..

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని 9 హైస్కూళ్లు 93.53 శాతం ఉత్తీర్ణత సాధించగా, 4 పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు.

బుగ్గారం మండలంలో వందశాతం..

బుగ్గారం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బుగ్గారం మండలం సత్తా చాటింది.వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలవడం ఎంతో సంతోషకరంగా ఉందని ఎంఈవో బత్తుల భూమయ్య తెలిపారు. మండలంలోని ఏడు హైస్కూళ్ల పరిధిలో మొత్తం 154 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారంతా పాసయ్యారు.

కథలాపూర్‌లో 94.30 శాతం..

కథలాపూర్: ఎస్సెస్సీ ఫలితాల్లో కథలాపూర్ మండలంలో 94.30 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో ఆనందరావు మంగళవారం తెలిపారు.మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 421 మంది విద్యార్థులు హాజరు కాగా... 397 మంది ఉత్తీర్ణులయ్యారు.

గొల్లపల్లిలో 87 శాతం ఉత్తీర్ణత..

గొల్లపల్లి:మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎసెస్సీ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజయకేతనం ఎగురవేశారు. మండల వ్యాప్తంగా 87.05 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో జమునదేవి తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 92 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

మల్యాల మండలంలో 98% ఉత్తీర్ణత

మల్యాల: పదో తరగతి ఫలితాల్లో మల్యాల మండలం 98% ఉత్తీర్ణత సాధించింది సత్తా చాటింది. మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. మండలంలోని 10 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 156 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 7 జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ధర్మపురిలో 95.22 శాతం..

ధర్మపురి: పది పరీక్షల ఫలితాల్లో 95.22 శాతం విద్యార్థులు పాస్ అయినట్లు ఎంఈవో భూమయ్య తెలిపారు. మండలంలోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 590 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 568 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 95.22 ఉత్తీర్ణత శాతం వెలువడింది. మండలంలోని ఆరెపెల్లి, రాజారం, తిమ్మాపూర్, తుమ్మెనాల, మైనార్టీ గురుకుల పాఠశాల, కేజీబీవీ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.

సత్తా చాటిన గురుకులాల విద్యార్థులు



అంజలి | అంజన | మైత్రి | శ్రీనిధి | స్పందన

మెట్‌పల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 77మంది విద్యార్థినుల్లో వెగ్యారపు అంజన, జె మైత్రీ, గుజ్జెటి శ్రీనిధి, స్పందన, డబ్బా అంజలి 10 జీపీఏ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ కోటగిరి ఆనందం అభినందించారు. వెల్లుల్ల, ఆత్మకూర్, జగ్గాసాగర్, విట్టంపేట, మెట్లచిట్టాపూర్, సత్తెక్కపల్లి, మేడిపల్లి, రాజేశ్వర్‌రావుపేటల్లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.



మోక్షిత | సహస్ర

బీసీ గురుకుల విద్యార్థినులు వందశాతం పాస్

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సిహెచ్. మోక్షిత, ఎ. సహస్ర 10 జీపీఏ సాధించారు.



వైష్ణవి

మేడిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు..

మేడిపల్లి: పదో తరగతి ఫలితాల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. కుంబోజి వైష్ణవి, 10 జీపీఏ సాధించింది. మండల వ్యాప్తంగా 17 హైస్కూళ్లలో 583 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 571 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో గంగుల వీరేశం తెలిపారు.



అశ్విని

కోరుట్ల మండలంలో 95 శాతం, పట్టణంలో 83 శాతం..

కోరుట్ల/కోరుట్ల రూరల్: పదో తరగతి ఫలితాల్లో పట్టణంతో పాటు మండలంలోని 18 జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కల్లూర్ మోడల్ విద్యార్థిని అశ్విని 10 జీపీఏ సాధించింది. మండలంలోని 12 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాల, అయిలాపూర్, యూసుఫ్‌నగర్ ఉన్నత పాఠశాలల్లో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.



అక్షర

10 జీపీఏ సాధించిన అక్షర...

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన చుక్క అక్షర (పెంబట్ల) పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ (ఆంగ్లమాధ్యమం) సాధించింది. అక్షర తల్లి తిరుమల, తండ్రి రాజేశం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తారు.

నిరుపేదలకు అండగా కేంద్ర సంక్షేమ పథకాలు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలు నిరుపేదలకు అండగా నిలిచాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. మంగళవారం రాయికల్ మండలం కిష్టంపేట, అల్లీపూర్ గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. దేశరక్షణ కోసం ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నపునేని వేణు, నాయకులు పరమేశ్వర్, రాజగోపాల్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో మహిళలకు ప్రాధాన్యత

కథలాపూర్: చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించి బీజేపీ హయాంలోనే మహిళలకు అధిక ప్రాధాన్యతనిచ్చారని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం సిరికొండ, పోతారం గ్రామాల్లో బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి వ్యాపారాల్లో ప్రోత్సహించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, బండ అంజయ్య, ధర్మపురి జలందర్, పిడుగు ఆనంద్‌రెడ్డి, జిల్లా సత్యం, తదితరులు పాల్గొన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

రాయికల్(జగిత్యాలరూరల్): నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పడాల తిరుపతి అన్నారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో మంగళవారం ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారం చేశారు. నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు నిరుపేదలందరికీ ఎంతో లబ్ధి చేకూర్చాయన్నారు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను పువ్వుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల అమలులో విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళల బ్యాంక్ ఖాతాల్లో నెలకు రూ. 2,500 జమ చేస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపుకోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు, నాయకులు దొప్పల జలందర్, చెక్కపెల్లి రాజుకుమార్, మామిడిపెల్లి రవి, కేసరి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలోని కట్లకుంట, తొంబరావుపేట, గుండ్లపల్లి, పోరుమల్ల గ్రామాల్లో మంగళవారం వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్ కు మద్దతుగా ప్రచారం చేశారు. ఉపాధి హామీ కూలీలతో కాసేపు మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర వ్యతిరేకత



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్:ప్రజాసంక్షేమాన్ని విస్మరించి.. పెట్టుబడిదారుల కొమ్ముకాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొర్రెపల్లిలో మంగళవారం నిర్వహించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలు అంటూ కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు కాటిపెల్లి సరోజన, మారు సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు దేవ మల్లయ్య, కదుర్క నర్సయ్య, క్యాతం జీవన్‌రెడ్డి, బిట్ల నరేష్, బైరి రాకేష్, కొమ్ముల జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌లో మంగళవారం ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిరెడ్డి,ఇతర నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకొస్తే రిజర్వేషన్లు రద్దు



దమ్మన్నపేటలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: రానున్న ఎన్నికల్లో బీజేపీ మరోసారి అధికారంలోకొస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మాచాపూర్, వల్లంపల్లి, కల్వకోట, దమ్మన్నపేటలో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రిజర్వేషన్ల రద్దు కోసమే మోదీ 400సీట్లు కావాలని అంటున్నారని తెలిపారు. మాచాపూర్ మాజీ సర్పంచ్ బాలరాజు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, సాయిని గంగారెడ్డి, గడ్డం జలందర్ రెడ్డి, మార్గం నర్సారెడ్డి, మార్గం గంగారాజం, దశరధరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కుటుంబసభ్యులు తిప్పికొట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఏకమైనా ప్రజలు అభివృద్ధి వైపే ఉంటామని, భారతదేశాన్ని ప్రగతిపథం వైపు తీసుకెళ్తున్న నరేంద్రమోదీని విశ్వసిస్తూ బీజేపీకే పట్టంకడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, ప్రచారక్ రాజు, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఒకరిపై కోడ్ ఉల్లంఘన కేసు

జగిత్యాలక్రైం:జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి టీఆర్‌నగర్‌కు చెందిన కోటగిరి సుమన్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషిస్తూ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు. దీనిని అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొండ వేణుగోపాల్ సుమన్‌ను నిలదీయగా.. అతనిని కూడా దుర్భషలాడాడు. వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు సుమన్‌పై ఎన్నికల ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

‘జీవన్‌రెడ్డిపై అర్వింద్ వ్యాఖ్యలు సరికాదు’

సారంగాపూర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ జీవన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎంపీగా అరవింద్ మా రెండు మండలాల ప్రజలకు చేసింది ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం సారంగాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సోమవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై అరవింద్ చేసిన వ్యాఖ్యలపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జీవన్‌రెడ్డి తాను గెలిచినా, ఓడినా ప్రజల మధ్యనే ఉన్నారని తెలిపారు. సమావేశంలో బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ వైద్యుడు ఎడమల శైలేందర్ రెడ్డి, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ ముక్క శంకర్, తాటిపర్తి శోభారాణి, ఎంపీటీసీ రంగు లక్ష్మణ్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలా పార్టీ అధ్యక్షులు కొండ్ర రాంచంద్రారెడ్డి, చెర్ప్వారి సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

బుగ్గారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి అడ్లూరి పార్టీలోకి ఆహ్వానించారు. వెల్గొండ గ్రామానికి చెందిన ఎంపీటీసీ రేండ్ల లక్ష్మీరవీందర్,యశ్వంతరావుపేట మాజీ సర్పంచ్ తాండ్ర సత్యనారాయణరావు,శెకల్ల మాజీ సర్పంచ్ అయిల్నేని సురేందర్‌రావు,బీర్‌సాని మాజీ సర్పంచ్ జక్కుల లక్ష్మి శ్రీనివాస్,వెల్గొండ ఉపసర్పంచ్ అక్కల గంగవ్వ రాయమల్లు కాంగ్రెస్‌లో చేరారు. వీరితో 150 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

మెట్‌పల్లిరూరల్: దేశాభివృద్ధికి కోసం నిరంతరం పాటుపడే బీజేపీకి ఓటు వేయాలని ఆ పార్టీ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ లో ఉపాధి కూలీలను బీజేపీ నాయకులు మంగళవారం కలిసి ఓట్లు అభ్యర్థించారు. మోదీ రావాలంటే బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, సాయిరెడ్డి,రవి,మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాచుపెల్లిలో లక్కపురుగుల బెడద

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లిలో లక్కపురుగుల బెడద తట్టుకోలేకపోతున్నామని మంగళవారం గ్రామస్తులు గ్రామ కార్యదర్శి శేఖర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామంలో ఉన్న రైసుల మిల్లుల ద్వారా వస్తున్న లక్కపురుగులు ఇళ్లలోకి రావడంతో నిత్యం ఇబ్బందిగా మారింది. ఏళ్ల నుంచి ప్రధాన సమస్యగా ఉన్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై వెంటనే దృష్టి సారించాలని అధికారికి ఫిర్యాదు చేశారు.

పేదల పార్టీ కాంగ్రెస్‌ని ప్రజలు ఆదరించాలి

మల్లాపూర్: పేదల పార్టీ కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని గొర్రెపల్లిలో మంగళవారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు.

ఎలమ్మకు బోనాలు



జగ్గాసాగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో రేణుక ఎలమ్మకు బోనాలు సమర్పించారు. మంగళవారం డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా బోనాలతో వెళ్లిన గౌడ కులస్తులు ఎలమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం సభ్యులు,గ్రామస్తులు,మహిళలు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాలు..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో ఎలమ్మ పట్నాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు ఎల్లమ్మ పట్నాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, నిజామాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్, మాజీ మంత్రి రాజేశం గౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడే ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో మంగళవారం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొని మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.